జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి


ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్లగొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

మంగళవారం | 21 | జనవరి | 2025 ◆ పేజీలు : 8



# రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి ఎల్లా వేళల సహకారం

15 రోజుల్లో చుట్టుపక్కల అంతర్గత రహదారుల నిర్మాణాలను పూర్తి చేస్తాం

సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందజేస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

*నల్గొండ, ప్రజాజ్యోతి ప్రతినిధి:*

నల్గొండ జిల్లా, కనగల్ మండలం, ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ దేవాలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాలకవర్గం చైర్మన్, డైరెక్టర్లు వారికి లభించిన పదవిని పదవిగా కాకుండా బాధ్యతగా పనిచేయాలని, దేవునికి సేవ చేస్తూనే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని, పాలకవర్గం దేవునికి భక్తులకు అనుసంధానంగా ఉండాలని, దేవాలయాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. దేవాలయానికి నల్గొండ నుండే కాకుండా, హైదరాబాద్ నుండి కూడా భక్తులు వచ్చే విధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రేణుక ఎల్లమ్మ దేవాలయం అభివృద్ధిలో భాగంగా 15 రోజుల్లో చుట్టుపక్కల అంతర్గత రహదారులు మంజూరు చేయడమే కాకుండా పూర్తి చేస్తామని తెలిపారు. దేవాలయ ఫంక్షన్ హాల్ కళ్యాణ మండపం ఎత్తు పెంచేలా కృషి చేస్తామని, దేవాలయ సౌకర్యాల కోసం 4 కోట్ల బడ్జెట్ అవుతుందని, ఇందుకు ప్రభుత్వం తో పాటు, పాలకవర్గ సభ్యులు సైతం ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని కోరారు. కనగల్ మండలం లో రహదారుల అభివృద్ధికి గాను రోడ్లు, భవనాల శాఖ ద్వారా సుమారు 100 కోట్ల రూపాయలను

మిగతా 2 లో...



# ప్రతిపక్షాలవి దిగజారుడు రాజకీయాలు

వెల్మినేడు వద్ద డ్రై పోర్టు నిర్మాణానికి కృషి

ఆరు లైన్ల విస్తరణ పనులను మూడు నెలల్లో ప్రారంభం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

*నల్గొండ, ప్రజాజ్యోతి ప్రతినిధి:*

నల్లగొండ జిల్లాలో ప్రతిపక్ష పార్టీలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని, ప్రభుత్వం పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని రాష్ట్రరోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. సోమవారం నల్లగొండ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు డిపాజిట్లు కోల్పోయేలా బీఆర్ఎస్‌ను ఓడించినా సిగ్గులేకుండా ప్రజలను భయందోళనలకు గురిచేసేలా తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. గతంలోనే తిరుమలగిరి సూర్యాపేట రహదారిలో భూములు పోయాయి. ఫ్లైఓవర్ తో మళ్లీ భూములు

మిగతా 2 లో...

# రైతు సంక్షేమానికి... కృషి చేస్తున్నది మా ప్రభుత్వమే

ఇప్పటికే ఉచిత విద్యుత్తు, రైతు రుణమాఫీ

26 నుండి రైతు భరోసా

తిప్పర్తి జంక్షన్ అభివృద్ధికి తొమ్మిది కోట్లు ఖర్చు

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

*నల్గొండ, ప్రజాజ్యోతి ప్రతినిధి:*

దేశానికి రైతు వెన్నెముక అన్నది నిజం చేసి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం తమదేనని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం ఆయన నల్గొండ జిల్లా, తిప్పర్తి మండలం లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు

మిగతా 2 లో...



# నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందేలా పనిచేయాలి...

- ఎమ్మెల్యే బి ఎల్ ఆర్



2 లో...

## నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందేలా పనిచేయాలి...!

**– ఎమ్మెల్యే బి ఎల్ ఆర్**

*మిర్యాలగూడ, జనవరి 20, ( ప్రజాజ్యోతి ):*

జనవరి 26 నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న 4 సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా అధికారులు కృషి చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అధికారులను కోరారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో రెవిన్యూ,మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించనున్న నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు ప్రతి పేదవాడి గడపకు అందాలని కోరారు. ఎంపిక ప్రక్రియలో రాజకీయనాయకుల ఒత్తిళ్లకు తలఒగ్గకుండా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరగాలని ఆదేశించారు. రాజకీయాలు కుల,మతాలకతీతంగా ప్రతి నిరుపేదకు పథకం ద్వారా లబ్ధి చేకూరాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పక్కాగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్, తహసిల్దార్లు హరిబాబు, జవహర్లాల్, సురేష్ కుమార్, పుష్పలత ఎంపీడీవో శేషగిరి శర్మ, ఎంపీఓ మోసిన్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి కృషి చేస్తున్నది మా ప్రభుత్వమే



(మొదటి పేజీ తరువాయి...)

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ముందుగా మంత్రి తిప్పర్తి మండలం పర్జూరులో పిఎసిఎస్ భవనానిన్నీ ప్రారంభించారు. అంతేకాక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ ను ప్రారంభించారు.అనంతరం తిప్పర్తిలో పిఎసిఎస్ గోడౌన్ ను ప్రారంభించారు. నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే డిసిసిబి నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతు దేశానికే వెన్నెముక అనే నానుడిని నిజం చేసేలా తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా ఉచిత విద్యుత్తు, రైతు రుణమాఫీ చేశామని, ఈనెల 26 నుండి రైతు భరోసా కార్యక్రమాలను అమలు చేయనున్నదని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి సమయంలో రైతులకు ఉచిత కరెంటు ఇవ్వడం జరిగిందని, మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో రుణమాఫీ చేశామని చెప్పారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకకాలంలో రైతులకు 2 లక్షల రుణమాఫీ చేశామని,రెండు లక్షల కన్నా పైనున్న రైతుల రుణాలు కూడా మాఫీ చేస్తున్నామని, ఎంతోమంది కోపరేటివ్ బ్యాంకులో రుణాలున్నవారు కూడా ఇందులో ఉన్నారని తెలిపారు. ఈనెల 26నుండి రైతు భరోసా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, ఇందులో భాగంగా వ్యవసాయ యోగ్యమైన భూములను గుర్తించి వారందరికీ రైతు రుణమాఫీ ఇస్తామని, వారం, పది రోజులలో రైతుల అకౌంట్లో ఈ డబ్బులు జమ కానున్నాయని ఆయన తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వం 26నుండి ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాలు అమలు చేయనున్నదని చెప్పారు. 10 ఏళ్లలో రాష్ట్రప్రభుత్వం ఏ ఒక్కరికి ఇండ్లు కట్టించలేదని అన్నారు. రానున్న పది, పదిహేను రోజుల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద విడతకు 6000 చొప్పున సంవత్సరానికి 12,000 రూపాయలను ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉండి గత సంవత్సరం కనీసం 20 రోజులు పని చేసిన వారందరికీ వారి అకౌంట్లో డబ్బులు పడనున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడికి, నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, వీటన్నింటిని గ్రామసభలు నిర్వహించి గ్రామసభల్లోనే నిర్ణయం తీసుకుంటామని, పై నాలుగు పథకాల అమలులో ఎలాంటి పైరవీలకు తావులేదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినప్పటికీ నాలుగు నెలలు పార్లమెంటు ఎన్నికలతో గడిచిపోయిందని, ఎనిమిది నెలల్లోనే అనేక కార్యక్రమాలు చేశామని చెప్పారు. తిప్పర్తి జంక్షన్ అభివృద్ధికి తొమ్మిది కోట్లు ఖర్చు చేయనున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి మాట్లాడుతూ రైతు రుణమాఫీలో నల్గొండ జిల్లానే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. రైతులు కిసాన్ క్రెడిట్ కార్డులను ఉపయోగించుకోవాలని, త్వరలోనే తిప్పర్తి సహకార బ్యాంకుకు స్థలాన్ని మంజూరు చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ సంపత్ రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు, ఆర్డిఓ అశోక్ రెడ్డి, తహసిల్దార్, మాజీ జెడ్పిటిసి రామ్ రెడ్డి ఉన్నారు.

# రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి ఎల్లా వేళల సహకారం

(మొదటి పేజీ తరువాయి...)





ఇది వరకే మంజూరు చేసామని, దోరేపల్లి నుండి పగిడిమర్రి, గుర్రంపల్లి వరకు 50 కోట్లు, పగిడిమర్రి నుండి సోమన్నవాగు, సాగర్ రోడ్డు వరకు 40 కోట్లు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈనెల 26 నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అందరికీ అందజేస్తామని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి మీడియా ప్రతినిధుల తో మాట్లాడుతూ అర్వపల్లి, దానంచెర్ల రహదారిపై అర్వపల్లి వద్ద ఫ్లైఓవర్ కోసం భూములు పోతున్నాయని అపోహలను సృష్టిస్తున్నారని, ఇది ఎంత మాత్రం నిజం కాదని తెలిపారు. కనగల్ జంక్షన్ అభివృద్ధి చేసినట్లుగానే అర్వపల్లి జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు జంక్షన్ అభివృద్ధి పనులు మాత్రమే చేపట్టేందుకు సర్వే నిర్వహిస్తున్నామని, అక్కడ ఎలాంటి ఫ్లైఓవర్ నిర్మాణం జరగడం లేదని, ఇందుకోసం ప్రజలకు సంబంధించి ఒక్క ఇంచు భూమిని కూడా తీసుకోవటం లేదని మంత్రి స్పష్టం చేశారు. జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణకు మాత్రమే చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. నల్గొండ జిల్లా అభివృద్ధిలో భాగంగా త్వరలోనే 900 కోట్ల రూపాయలతో ఏఎంఆర్పి ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీ కాలువల లైనింగ్ పనులు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఎస్ఎల్బిసి ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నామని, బస్వాపూర్ పథకాన్ని నెలలోనే పూర్తి చేస్తున్నామని చెప్పారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో నాలుగు భవనాల నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని, అలాగే 80 కోట్లతో చేపట్టిన పనులు నడుస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం 10 ఏళ్ల నుండి నుండి ఏ ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వలేదని, ఇప్పుడు తమ ప్రభుత్వం కొత్తగా 40 లక్షల రేషన్ కార్డులు ఇవ్వనున్నదని, ఈ నెల 27 నుండి రేషన్ కార్డులతో పాటు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వనున్నామని, పాత రేషన్ కార్డులు అలాగే కొనసాగుతాయని, కొత్త కార్డులు 40 లక్షలు ఇవ్వనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. కాగా దర్వేసి పురం శ్రీ రేణుక ఎల్లమ్మ నూతన పాలకమండలి చైర్మన్ గా వెంకట్ రెడ్డి, డైరెక్టర్లు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు, తహసిల్దార్, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులు కష్టపడి చదివి పైకి రావాలి...**

సమాజంలో ఉన్నత స్థానం సాధించేందుకు బాగా కష్టపడి చదివి పైకి రావాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం అయన కనగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, చదువు ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ విద్యా భారతి పాఠశాలలో కొన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా మరుగుదొడ్లకు ఇబ్బంది గా ఉందని, అలాగే వాటర్ ట్యాంక్ కావాలని కోరగా, తక్షణమే మంత్రి 10 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో టాయిలెట్స్ తో పాటు, మినీ వాటర్ ట్యాంక్ ను చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలో సాయంత్రం సమయంలో కొంతమంది అల్లరి మూకలు పాఠశాలలో చొరబడుతున్నారని తెలుపగా, తక్షణమే వారిపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి కనగల్లు జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించారు.

**ఆర్ అండ్ బి రోడ్డు పనులకు శంకుస్థాపన...**

నల్గొండ జిల్లాలో ఆర్ అండ్ బి రహదారుల ఏర్పాటు, పటిష్టతకు ఆర్ అండ్ బి శాఖ ద్వారా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండలం, తిమ్మన్నగూడెం వద్ద ఆర్ అండ్ బి సాగర్ రోడ్డు నుండి కనగల్ వయా తిమ్మన్నగూడెం వరకు 14 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించి పటిష్ట పరచనున్న ఆర్ అండ్ బి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్గొండ జిల్లాకు ఆర్ అండ్ బి ద్వారా ప్రత్యేక నిధులను తీసుకువచ్చి రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమంలో భాగంగా ఈనెల 26 నుండి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాలని అమలు చేయబోతున్నదని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమంలో భాగంగా త్వరలోనే లబ్ధిదారులకు ఖాతాలలో 6000 రూపాయల చొప్పున సంవత్సరానికి 12,000 రూపాయలు జమ కానున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పాత రేషన్ కార్డులను కొనసాగించడంతోపాటు, నూతనంగా రేషన్ కార్డులు ఇవ్వనున్నామని, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకొని అర్హుల జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ,త్వరలో నిర్వహించనున్న గ్రామ సభలలో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. రైతు రుణమాఫీ కింద రుణమాఫీ పొందని రైతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆర్డిఓ అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి డిప్యూటీ ఇంజనీర్ గణేష్, కనగల్ తహసిల్దార్ పద్మ ,స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

# ప్రతిపక్షాలవి దిగజారుడు రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి...)

కోల్పోతారని ప్రతిపక్షపార్టీలు ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారన్నారు. తెలంగాణకు సంబంధించిన గౌరెల్లి భద్రాచలం రహదారి గానీ, పెద్దఅంబర్ పేట్, రామోజీ ఫిల్మ్ సిటీ, బాటసింగారం, ఫ్లైఓవర్లు నిర్మించినట్లు తెలిపారు.

**మూడు నెలల్లో పనుల ప్రారంభం..**

ఎన్.హెచ్ 65 ని ఆరు లేన్లుగా విస్తరించే పనులను వచ్చే మూడు నెలల్లో ప్రారంభించి, 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ప్రమాద రహిత రహదారిగా మార్చి, రెండు, మూడు గంటల్లో విజయవాడకు చేరేలా రోడ్డును అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. 161.518 కిలోమీటర్ల పొడవైన రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులను 5 ప్యాకేజీలుగా విభజించి 7104.06 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచినట్లు చెప్పారు. ఫిబ్రవరి 14వ తేదీన టెండర్లు ఓపెన్ చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. దక్షిణ భాగం డీపీఆర్ కోసం ఇప్పటికే టెండర్లు పిలిచామన్నారు.

**వెలిమినేడు వద్ద డ్రై పోర్టు నిర్మాణానికి కృషి..**

నల్గొండ జిల్లా వెలిమినేడు వద్ద ఒక డ్రైపోర్టును నిర్మించాలని ముఖ్యమంత్రితో చర్చించి నిర్మలాసీతారామన్ కి ఇప్పటికే లేఖ రాసినట్లు కోమటిరెడ్డి తెలిపారు. బందర్ పోర్ట్, కాకినాడ పోర్ట్ నుంచి గుండ్రాంపల్లి దగ్గర వెలిమినేడు వద్ద డ్రైపోర్టు ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నాం అన్నారు. గుండ్రాంపల్లి దగ్గర నుంచి రీజినల్ రింగ్ రోడ్డుకు చాలా దగ్గరగా ఉండటం వల్ల తెలంగాణ వ్యాప్తంగా సరుకు రవాణాకు సులువుగా ఉంటుందని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

# సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

★ మండలంలో పరుగులు పెడుతున్న అభివృద్ధి సంక్షేమం

★ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న

★ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలకోట్ల మల్లేష్





*తుంగతుర్తి, జనవరి 20, (ప్రజా జ్యోతి );*

ఈనెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీల్లో భాగంగా చేపట్టే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు కలకోట్ల మల్లేష్ అన్నారు. సోమవారం విలేకరులతో వారు మాట్లాడుతూ... తుంగతుర్తి మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత స్థానిక శాసనసభ్యులు మందుల సామెల్ ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందని అన్నారు. సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే సహకారంతో మండలంలో అర్హులైన ప్రతి ఒక్క ఇంటికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, తదితర సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లి రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.

# ప్రజా సమస్యలపై అంకితభావంతో పనిచేయడమే కల్లూరు యాదగిరి కి మనం అర్పించే ఘనమైన జోహార్లు

*నార్కట్ పల్లి జనవరి 20( ప్రజా జ్యోతి ):*



ప్రజా సమస్యలపై అంకితభావంతో పనిచేయడమే సిపిఎం శ్రేణులు కల్లూరు యాదగిరి గారికి అర్పించే ఘనమైన జోహార్లని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, నకరికల్లు శాసనసభ్యులు వేముల వీరేశములు అన్నారు. ఆయన గృహంలో జిల్లా మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆయన పార్థీవదేహానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. రైతు సంఘం అఖిలభారత మీటింగ్లో ఉన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, నల్లగొండ మాజీ శాసనసభ్యులు నంద్యాల నరసింహారెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, యాదగిరికి సంతాపం ప్రకటించారు. సోమవారం నాడు సిపిఎం మండల కమిటీ సభ్యులు మరియు నార్కట్పల్లి మాజీ వైస్ ఎంపీపీ కల్లూరు యాదగిరి ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. కామ్రేడ్ కల్లూరి యాదగిరి ఏ పార్టీలో ఉన్న పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేశారని చెప్పారు. ఎల్లారెడ్డి గూడెంలో ఆయన ప్రజాప్రతినిధిగా పేద ప్రజలకు భూములు పంచారని గుర్తు చేశారు. ఆయన నిరంతరం గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారని పేర్కొన్నారు. బ్రాహ్మణవెళ్ళాముల ఎత్తిపోతల పథకంలో, యూనివర్సిటీ నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు తగిన నష్టపరిహారం ఇప్పించడానికి అనేక ఉద్యమాలు చేశారని చెప్పారు. ప్రజా ఉద్యమాలు చేసే క్రమంలో పాలకవర్గాలు కేసులు పెట్టి జైల్లో పెట్టిన మొక్కవోని దీక్షతో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన ప్రజా సమస్యలపై పోరాడే క్రమంలోనే సర్పంచుగా రెండుసార్లు ఎంపీటీసీగా వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారని చెప్పారు. పార్టీలకతీతంగా ప్రజలకు సేవ చేశారని, ఆయన సేవలను కొనియాడారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చిన నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు పని చేశారని గుర్తు చేశారు. ఆయన మరణం కమ్యూనిస్టు పార్టీకే కాకుండా ఎల్లారెడ్డి గూడెం ప్రజానీకానికి తీరని లోటుని అన్నారు. ఆ కుటుంబానికి ప్రజలంతా అండగా ఉండాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడమే ఆయనకు మనం అర్పించే నిజమైన జోహార్లని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రజలంతా ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా అంతిమయాత్రలో ఎల్లారెడ్డిగూడెంలో వందలాది మంది పాల్గొన్నారు. అంతిమయాత్రలో సిపిఐఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, నకరికల్లు శాసన సభ్యులు వేముల వీరేశం, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నల్లగొండ యాదాద్రి జిల్లా కార్యదర్శిలు తుమ్మల వీరారెడ్డి, మహమ్మద్ జాంగిర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారి ఐలయ్య, నాగర్జున, కందాల ప్రమీల, ప్రభావతి, బండా శ్రీశైలం, మాటూరు బాలరాజు, మేక్ అశోక్ రెడ్డి, జిల్లాల పెంటయ్య, చిన్నపాక లక్ష్మీనారాయణ, నర్సిరెడ్డి, మహ్మద్ సలీం, ధన్యంపల్లి సత్తయ్య, మహేష్, జిట్ట నగేష్, పెంజర్ల సైదులు, బొజ్జ చిన్న వెంకులు శంకరయ్య మాజీ ఎంపీపీలు రేగట్టే మల్లికార్జునరెడ్డి, సూది రెడ్డి నరేందర్ రెడ్డి, బత్తుల ఊషయ్య, వడ్డే భూపాల్ రెడ్డి, పాశం శ్రీనివాస్ రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, అయితరాజు యాదయ్య, పుల్లంల ముత్తయ్య, చెరుకు పెద్దలు, చింతపల్లి బయన్న, కుమ్మరి శంకర్, దండు రవి, కోప్పు శ్రావణ్ కుమార్, జాల యాదమ్మ, కంఠ్లమహేశ్వర్, రెడ్డిపల్లి శంకర్ రఘు, భగవంతు రెడ్డి, సత్యం, కట్ట రామచంద్రం, అర్థం శ్రీను, శంకర్, నాగరాజు, పాల్గొన్నారు.

# ఆందోళన వద్దు... పథకాల ఎంపిక నిరంతర పక్రియ...!

**అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుంది**

**రాజకీయ ఒత్తిళ్లకు అవకాశం లేదు.. ఎంపిక పారదర్శకం**

**–సంయుక్త సమావేశంలో అధికారుల వెల్లడి**

*మిర్యాలగూడ, జనవరి 20, ( ప్రజాజ్యోతి ):*

భుత్వం ఈనెల 26 నుండి అమలు చేయనున్న నాలుగు పథకాలు ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసాలకు లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని, ఎవరు ఆందోళన చెందవద్దని సంయుక్త సమావేశంలో అధికారులు వెల్లడించారు. పట్టణంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ హరిబాబు అధ్యక్షతన రెవిన్యూ, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అధికారుల సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులపై 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయి లో ప్రత్యేక టీమ్ లతో పరిశీలన చేశామన్నారు. 21 నుండి 24 వరకు గ్రామసభ, వార్డు సభలు ఏర్పాటు చేసి ప్రజల ఆమోదం తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ సభలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ప్రజలు వ్యక్తం చేయొచ్చు అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం సుమారు 75,800 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డులలో మార్పులు, చేర్పుల కోసం సుమారు 10,300 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రజా పాలన సందర్భంగా తెల్ల కాగితాలపై ఇచ్చిన దరఖాస్తు లను కూడా పరిశీలించనున్నట్లు తెలిపారు. గ్రామ సభలు నిర్వహించే సమయంలో కూడా దరఖాస్తులు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా పథకంలో సుమారు 600 ఎకరాలు వ్యవసాయ తర భూములుగా గుర్తించినట్లు తెలిపారు. ఆత్మీయ భరోసా పథకంలో లబ్ధిదారులు ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉండి, 2023 –24 సంవత్సరంలో 20 పని దినాలు చేసి ఉండాలని, వారి పేరిట ఎలాంటి భూములు ఉండకూడదని అలాంటి వారే లబ్ధిదారులుగా గుర్తించబడతారని అన్నారు. మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ ఎండి యూసుఫ్ మాట్లాడుతూ పట్టణంలో 20,725 ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 14,582 మంది అసలు ఇల్లు లేని వారిగా గుర్తించినట్లు తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కోసం 1605 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 21 నుండి 24 వరకు రోజుకు 12 వార్డులు చొప్పున వార్డు సభలు నిర్వహించి ఎంపిక చేపడుతామని తెలిపారు. కాగా లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, ఎవరు ఆందోళన పడవద్దని, పథకం కోసం ఎప్పుడైనా మండల కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో దామరచర్ల, వేములపల్లి, మాడుగులపల్లి తహసీల్దారులు జవహర్లాల్, సురేష్ కుమార్, పుష్పలత, మిర్యాలగూడ ఎంపీడీవో శేషగిరి శర్మ, ఆర్ ఐ లు బి.సత్యనారాయణ, శ్యామ్, టి. రామకృష్ణ తదితరులు వున్నారు.



# నేటి నుంచి 24 వరకు గ్రామసభలు

*ఆత్మకూర్ ఎం జనవరి 20(ప్రజా జ్యోతి )*

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు పథకాలు రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులను ఈనెల 16 నుండి మండలంలోని అన్ని గ్రామాలలో అధికారులు లబ్ధిదారులను పారదర్శకంగా చేపట్టి అట్టి పరిశీలన చేసి జాబితాను ఈనెల నేటి నుంచి 24 వరకు ప్రతి గ్రామంలోనూ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో పరిశీలన చేసిన జాబితాలో గ్రామ సభ నిర్వహించబడుతారు. గతంలో ప్రజాపాలన ద్వారా వచ్చిన దరఖాస్తులు అదే విధంగా గతంలో పెండింగ్ ఉన్న ప్రతి దరఖాస్తును పరిశీలించడం జరుగుతున్నదని గతంలో ఎవరికైనా ఈ పథకాలను దరఖాస్తు చేయని వారు ఉంటే గ్రామసభ యందు దరఖాస్తులు అందజేయాలని ఇట్టి కార్యక్రమం మండల ప్రత్యేక అధికారి రాజారామ్ విలేకరుల సమావేశంలో తెలియజేయడం జరిగింది. దీనిలో భాగంగా అధికారులుగా తాసిల్దార్ రవికుమార్ ఎంపీడీవో రాములు నాయక్ ఎం అపర్ణ ఎం ఏ ఓ సయ్యద్ సఫియుద్దీన్ నాయబ్ తాసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# హ్యాండ్ బాల్ టోర్నమెంట్లో ఏవియం విద్యార్థి ప్రతిభ




*నకిరేకల్, జనవరి 20 (ప్రజా జ్యోతి )*

ఈనెల 18 నుండి 20 వరకు కరీంనగర్ లో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్ ఏవియం స్కూల్ కు చెందిన జరవత్ కృష్ణుడు 9వ తరగతి విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చరని ఏవియం విద్యా సంస్థల అధినేత కందల పాపిరెడ్డి తెలిపారు. సోమవారం ఆ విద్యార్థిని షాలువతో సత్కరించి అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ కందాల స్వప్న శ్రీకాంత్ రెడ్డి, జితేందర్ రెడ్డి, పిఈటి నిమ్మల శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

# రైతు హామీలను అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ నలగాటి ప్రసన్న రాజ్**

*నకిరేకల్, జనవరి 20 (ప్రజా జ్యోతి )*

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రైతులు, మహిళలు, అన్నివర్గాల ప్రజలతో కలిసి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ నలగాటి ప్రసన్నరాజ్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా రైతులకు, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. రైతులకు యువతకు మహిళలకు పెద్దపీట వేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియమితమైన ఉద్యోగులకు నియామక పత్రాలను మాత్రమే ఇచ్చిందన్నారు. స్థానిక సంస్థ ఎన్నికలలో గెలుపొందేదుకు కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ పేర్లతో సర్వేలు నిర్వహిస్తుందన్నారు. ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలుపొందేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రుణ మాఫీ, రైతు భరోసా ఎగ్గొట్టిన రైతు వ్యతిరేక కాంగ్రెస్ సర్కారుపై బిఆర్ఎస్ జంగ్ సైరన్ మోగించిందన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ఎండగట్టేందుకు ఈనెల 21న బిఎస్ఆర్ రైతు మహాధర్నాను నిర్వహిస్తుందన్నారు ఈ కార్యక్రమానికి రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చల్లా కృష్ణారెడ్డి, నాయకులు ఊట్కూరు ఏడుకొండలు, ఎల్లపురెడ్డి సైదిరెడ్డి , నూక సైదులు, చిట్యాల రాజిరెడ్డి, ముప్పిడి యాదయ్య, జి శ్రీనివాస్, మాధగోని అరుణ్ కుమార్, గుండాల మల్లేష్, జమాల్ పాషా, అనంతుల సతీష్, చౌగోని శంకర్, గిద్దె అంజయ్య, మండలం సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి




నకిరేకల్ జనవరి 20 (ప్రజా జ్యోతి )

సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని 25న గొప్ప బహిరంగ సభ జరుగుతుందని అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు ఈరోజు మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో సిపిఎం పార్టీ రాష్ట్రమహాసభల పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈసందర్భంగా పెంజర్ల సైదులు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తున్న ది ఒక కమ్యూనిస్టులు మాత్రమే అని అన్నారు. పేదలు కార్మికులు కర్షకుల ఉద్యోగులు కష్టజీవులు హక్కుల కోసం పోరాడుతున్న పార్టీ సిపిఎం అని అన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలోని ఆర్థిక సామాజిక అంశాలు కార్మిక కర్షక పేదలు మహిళలు ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న అనేక ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేయడం జరుగుతుందని ఈ మహాసభలను జయప్రదం చేయడం కోసం ప్రజలందరూ సహక రించాలి అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు చిలుముల రామస్వామి, మురారి మోహన్ ఇటుకల సురేందర్, కట్టబక్కయ్య, జాల రమేష్ జాల ఆంజనేయులు ,చిలుకూరి సైదులు పాల్గొన్నారు.

## అవంతీపురం గ్రామ కార్యదర్శి పై కలెక్టర్ కు గ్రామస్తుల ఫిర్యాదు



మిర్యాలగూడ, జనవరి 20, ( ప్రజాజ్యోతి ):

మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం గ్రామపంచాయతీ కార్యదర్శి అవినీతికి పాల్పడుతుందంటూ గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారులు వల్దాస్ సురేష్, నాగరాజు, చిరంజీవి,కుమార్ లు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పంచాయతీకి చెందిన ట్రాక్టర్ ట్రాలీ, ట్యాంకర్ల కు రిజిస్ట్రేషన్ పేరిట డబ్బులు డ్రా చేసుకొని, రిజిస్ట్రేషన్ చేయించకుండానే తిప్పుతుందని అన్నారు. ప్రభుత్వ భూములను సొంత భూములుగా చూపిస్తూ పంచాయతీ రికార్డులకు ఎక్కించి పెద్ద ఎత్తున డబ్బులు దండుకుంటుందన్నారు. గ్రామపంచాయతీ నుంచి జారీ చేసే నివాస,ఆస్తి,జనన మరణ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేస్తుందంటూ ఆరోపించారు. పంచాయతీ పరిధిలోని అక్రమ లేఔట్ల ను గుర్తించి అడ్డుకోవాల్సింది పోయి, వారితో మిలాఖత్ అయ్యి ఫ్లాట్ల కు పంచాయతీ అనుమతి ఇస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతుందన్నారు. అవంతిపురం పంచాయతీ పరిధిలో సుమారు 20 ఎకరాల అక్రమ లే అవుట్ లు ఉన్నాయని వాటిపై చర్యలు శూన్యమని ఆరోపించారు. గ్రామంలో దోమలు, కోతుల బెడద అధికంగా ఉన్నప్పటికీ ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టలేదని, పారిశుద్ధ్య నిర్వహణ కూడా సక్రమంగా లేదని ఆరోపించారు. ఈ అవినీతిపై విచారణ చేపట్టాలంటూ కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# గ్రామాల్లో గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలి

**–నిడమానూరు ఎంపిడిఓ వెంకటేశం**

**–మండలంలో నేటి నుంచి 24వరకు గ్రామసభలు**






నిడమనూరు,జనవరి 20(ప్రజాజ్యోతి ):

అర్హులైన లబ్ధిదారులు గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలని నిడమానూరు ఎంపిడిఓ వెంకటేశం అన్నారు.జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మండలంలోని మండలంలోని 29 గ్రామ పంచాయితీలల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు సోమవారం ప్రజాపాలన కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకటేశం తెలిపారు. జనవరి 21నుంచి 24వరకు ఉదయం 10గంటల మంచి మధ్యాహ్నం వరకు అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు నిడమనూరు ఎంపీడీవో వెంకటేశం పేర్కొన్నారు. ఈసందర్భంగా ప్రజావాణిలో ఎంపిడిఓ వెంకటేశం,తహశీల్దార్ కృష్ణయ్య లు మాట్లాడుతూజనవరి 21 నుంచి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది . ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు వివిధ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.గ్రామసభల్లో కొత్త రేషన్ కార్డులతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు చేర్చడానికి దరఖాస్తులు స్వీకరించాలి. ఒకే కుటుంబం నుంచి వేరే పడ్తున్న కుటుంబాలకు కొత్త కార్డులు ఇచ్చేందుకు అప్లికేషన్లు తీసుకోవాలి. కుటుంబ పెద్దతో పాటు ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆధార్ కార్డులు, కులం, మొబైల్ నంబర్, చిరునామా వంటి వివరాలను తీసుకోవాలని తహశీల్దార్ కృష్ణయ్య స్పష్టం చేశారు.

**- తేదిల వారిగా గ్రామసభలు**

–21న ఇండ్లకోటయ్యగూడెం,తుమ్మడం, మార్లగడ్డక్యాంపు,వడ్డెరీగూడెం,రాజన్నగూడెం,పార్వతీపురం బంకాపురం,వెనిగండ్ల ,

–22న నిడమానూరు, వల్లభాపురం, వేంపాడు, వెంగన్నగూడెం,బంటువారిగూడెం, ఎర్రబెల్లి, బొక్కమంతులపహాడ్,ముకుందాపురం.అదేవిధంగా

–23న సూరేపల్లి,మారుపాక, వెంకటాపుర ం, సోమ వారిగూడెం, ఎ ర్ర గూడెం ,ముప్పారం,నార్మగూడెం,శాఖాపురం,

–24న రేగులగడ్డ,గుంటికగూడెం, గుంటిపల్లి, నందికొండవారి గూడెం, ఊట్కూరు ఆయా తేదీలలో జరిగే గ్రామసభలలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, అర్హులందరికీ రేషన్ కార్డుల వివరాలు గ్రామసభ ముందు ఉంచబడతాయని, ఎవరైనా ఏ పథకం కోసమైనా లబ్ధిచేకూరడం కోసం దరఖాస్తు చేసుకోవాలని భావిస్తే,వారు గ్రామసభలోనే ప్రత్యేకంగా ఏర్పరిచిన కౌంటర్లలో వారి దరఖాస్తులు ఇచ్చి రసీదు పొందవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకటేశం,నిడమానూరు తహశీల్దార్ కృష్ణయ్య ఎంఈఓ లావూరి వెంకన్న, ఏవో మునికృష్ణ ,ఏపిఎం లక్ష్మీనారాయణ,ఎంపివో కేదార్ నాయుడు,ఈవోఆర్డి రాధాకృష్ణ, సూపరింటెండెంట్ రమేష్, ఏఈలు సాయిప్రసాద్,వి.వెంకన్న, తదితరులు,పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర యాదవ విద్యావంతుల వేదిక ఉపాధ్యక్షురాలుగా డాక్టర్ రమాదేవి వెంకట్ యాదవ్



మిర్యాలగూడ. జనవరి 20, ( ప్రజాజ్యోతి ):

తెలంగాణ రాష్ట్ర యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రమాదేవి ఎన్నికయ్యారు .సోమవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర విద్యావంతుల వేదిక కార్యవర్గ సమావేశంలో ఆమెను ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ అన్ని రంగాలలో యాదవ జాతి అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తా మన్నారు.తన నియామాకానికి సహకరించిన అఖిల భారతయాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ యాదవ్ ,జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అప్పగింత




తుంగతుర్తి, జనవరి 20, (ప్రజా జ్యోతి );

తుంగతుర్తి సర్కిల్, తుంగతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకోవడంతో వారు తుంగతుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీను నాయక్, ఎస్సై క్రాంతి కుమార్ లు సి ఈ ఐ ఆర్ యాప్ ద్వారా ట్రేస్ చేసి వారి ఫోన్లను గుర్తించారు. అట్టి ఫోన్లను సోమవారం బాధితులకు సెల్ ఫోన్లు అందజే శారు. వారు మాట్లాడుతూ... ఇప్పటివరకు సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా మొత్తం 21 మొబైల్స్ ను ట్రేస్ చేసి బాధితులకు అప్ప గించినట్లు తెలిపారు. ఫోన్ పోయినవారు వెంటనే మీ సేవ లో అప్లై చేసిన అనంత రం పోర్టల్ లో అప్లై చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సతీష్, రవి తదితరులు, పాల్గొన్నారు.

## స్కాన్ చేయండి... అభిప్రాయం చెప్పండి

**★ అభిప్రాయాలు తెలుసుకునేందుకే క్యూఆర్ కోడ్**

**★ సర్కిల్ ఇన్స్పెక్టర్ శీను నాయక్**

తుంగతుర్తి, జనవరి 20, (ప్రజాజ్యోతి );

పోలీస్ సేవలపై ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పోలీస్ స్టేషన్ లో 'క్యూఆర్' కోడ్ ను ఏర్పాటు చేసినట్లు తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీను నాయక్ తెలిపారు. సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన క్యూ ఆర్ కోడ్ గురించి స్టేషన్ వచ్చిన పలువురికి వివరించి మాట్లాడారు.ప్రజలకు అందుతున్న పోలీస్ సేవల గురించి తమ తమ అభిప్రాయం తెలియజేసేందుకు 'క్యూఆర్ కోడ్ స్టికర్ల'ను అన్ని పోలీస్ స్టేషన్ లు,సర్కిల్ ఆఫీస్,అతికించడం జరిగిందని తెలిపారు .పోలీస్ స్టేషన్ కు వెళ్లిన ప్రజలు వారికి అందుతున్న ఐదు పోలీస్ సేవల అంశాలైన,ఫిర్యాదులు /పిటిషన్,ఎఫ్ఐఆర్,ఈ–చాలన్ ట్రాఫిక్ ఉల్లంఘనలు,పాస్ పోర్ట్ ధ్రువీకరణ,ఇతర అంశాలపై తమ అభిప్రాయాన్ని స్వచ్ఛందంగా క్యూఆర్ కోడ్(https://qr.me-qr.com/aZMTxHDm) స్కాన్ చేసి,అభిప్రాయాలు తెలియజేవచ్చని తద్వారా మీయొక్క అభిప్రాయాలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తాయన్నారు. మండల ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై క్రాంతి కుమార్, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, కానిస్టేబుల్స్ సతీష్, రమేష్,రవి, తదితరులు పాల్గొన్నారు.



# టీవీఎస్ క్రెడిట్ ఫైనాన్స్ సర్వీసెస్ లిమిటెడ్ బ్రాంచ్ ఏర్పాటు అభినందనీయం

### రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు

**కోదాడ టౌన్, జనవరి 20 (ప్రజా జ్యోతి ):**





కోదాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన టీవీఎస్ క్రెడిట్ ఫైనాన్స్ సర్వీసెస్ లిమిటెడ్ బ్రాంచ్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలో జోనల్ సేల్స్ మేనేజర్ గట్టు హరికృష్ణ కోదాడ లారీ అసోసియేషన్ అధ్యక్షులు తునాం కృష్టాలతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని బ్రాంచ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదాడలో బ్రాంచ్ ఏర్పాటుతో ముఖ్యంగా లారీ యజమానులకు, అన్ని రకాల వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గతంలో టీవీఎస్ సంస్థ వారి బ్రాంచ్ కోదాడలో లేకపోవడంతో ఖమ్మం, నల్గొండ వంటి పట్టణాలకు వెళ్ళవలసి వచ్చేదని దీంతో ఎంతో సమయం వృధా అయ్యేదని అన్నారు. కోదాడ చుట్టుపక్కల పరిసర ప్రాంత ప్రజలు అతి తక్కువ వడ్డీకే టీవీఎస్ సంస్థ వారు అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ట్రాన్స్ పోర్ట్ రమేష్, ఏరియా సేల్స్ మేనేజర్ చీకుర్తి రాజేశ్వరరావు, ఏరియా క్రెడిట్ మేనేజర్ టి నాగకృష్ణ, టెరిటరీ మేనేజర్ సునీల్, కోదాడ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలకు ప్రజలు అందుబాటులో ఉండాలి: ఎంపీడీవో శేషు కుమార్

**తుంగతుర్తి, జనవరి 20, (ప్రజా జ్యోతి );**



తుంగతుర్తి మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో నేటి నుండి (ఈనెల 21) నుండి 24 వరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల కొరకు గ్రామ సభలను నిర్వహించి గ్రామ సభల ఆమోదం మేరకు లబ్ధిదారుల ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో శేషు కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో ప్రజాపాలనలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల కొరకు ధరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను ఇటీవల సమగ్ర కుటుంబ సర్వేలో ఇంటింటి సర్వే చేసి లబ్ధిదారుల ఎంపిక చేసినట్లు తెలిపారు. తదనంతరం ఈ నెల 16 నుంచి 20 వరకు మండల అధికారుల ఆధ్వర్యంలో రెండో సారి ఫీల్డ్ సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశామని, వారి ఎంపికకు సంబంధించి ఈ నెల 21 నుంచి 24 వ తేదీ వరకు 24 గ్రామ పంచాయతీలలో రెవెన్యూ, అగ్రికల్చర్, పంచాయతీరాజ్ అధికారులు గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో శేషు కుమార్ తెలిపారు. గ్రామసభలు జరిగే తేదీలలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సభలకు హాజరై లబ్ధిదారుల ఎంపికకు సహకరించాలని కోరారు. గ్రామ సభలు ముగిసిన అనంతరం కూడా అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల, రేషన్ కార్డుల, రైతు భరోసా లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇట్టి అవకాశాన్ని మండల ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మాస్టిన్ కుల హక్కుల కోసం పోరాటం

### వెనుకబడిన కులాలను ప్రభుత్వం గుర్తించాలి

### కుల ధ్రువీకరణ ఆర్డీఓ ద్వారా కాదు తాసిల్దార్ ద్వారా మంజూరు చేయాలి

### మాస్టిన్ కుల రాష్ట్ర అధ్యక్షులు నాగిల్లి నర్సయ్య డిమాండ్

**కోదాడ టౌన్, జనవరి 20 (ప్రజా జ్యోతి ):**



మాస్టిన్ కుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నామని వెనుకబడిన మా కులాన్ని ప్రభుత్వం గుర్తించి అన్ని హక్కులను కల్పించాలని మాస్టిన్ కుల రాష్ట్ర అధ్యక్షులు నాగిళ్ల నరసయ్య డిమాండ్ చేశారు. ఇటికల మధు అధ్యక్షతన మంగళవారం కోదాడ పట్టణంలోని సాలార్జంగ్ పేటలో కోదాడ మండల మాస్టన్ కుల నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... వెనుకబడిన మా కులం హక్కులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, కనీసం కుల ధ్రువీకరణ పత్రం కూడా మండల కేంద్రంలోని తాసిల్దార్ ద్వారా కాకుండా ఆర్డీఓ ద్వారా ఇవ్వడం సమంజసం కాదని అన్నారు. గత కొంతకాలంగా హక్కుల కోసం పోరాడుతున్నామని అదే ధోరణిని ప్రదర్శించేందుకు పూర్తిస్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమిటీల ఏర్పాటు ముగిసిన అనంతరం ఈనెల 25వ తారీఖున కరీంనగర్లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని ఈ బహిరంగ సభ ద్వారా మా సత్తా ఏంటో చాట్ చెప్తామన్నారు. మండల కమిటీలో స్థానం లేనివారు రాష్ట్ర కమిటీ లో తప్పనిసరిగా స్థానం కల్పిస్తామని, ప్రతి కుల బంధువులు బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. అనంతరం నూతనంగా ఏర్పాటైన మండల కమిటీ అధ్యక్షులు నాగేల్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు దర్శనం వెంకటేశ్వర్లు, కోశాధికారి నాగిళ్ల దానేలు, ప్రధాన కార్యదర్శి ఇటికాల అబ్రారాము, కార్యదర్శి సులోమన్ ను అభినందించారు ఈ కార్యక్రమంలో ఇటుకల నాగరాజు, నాగిల్లి గోపి, నాగిల్లి చిరంజీవి, ఇటుకల రవి, రాముడు, ఎంకన్న, చిన్నోడు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

### బి ఆర్ ఎస్ డిమాండ్



**భువనగిరి, జనవరి 20, (ప్రజాజ్యోతి )**

అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వాలని భువనగిరి బి ఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కమిషనర్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణన, ఆధారంగా కాకుండ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క లబ్ధిదారునికి రేషన్ కార్డు మరియు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, డిమాండ్ చేసారు. అదే విధంగా గతం లో ఎవరైతే దరఖాస్తు చేసుకోలేదో ఇప్పుడు వార్డుల్లో నిర్వహిస్తున్న గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే అర్హులైన. వారికి సంక్షేమ పథకాలు అందని యెడల, బి ఆర్ ఎస్, పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ధర్నాలకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 60 లక్షలతో మౌళిక వసతులకు ఆమోదం

### – మున్సిపల్ చైర్ పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్

**భూదాన్ పోచంపల్లి, జనవరి 20 (ప్రజాజ్యోతి )**



పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్ అధ్యక్షతన, కమీషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోవు వేసవి కాలము దృష్ట్యా పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా నూతన మోటార్లకు 5.00 లక్షలు, వాటర్ పైపు లైన్ల రిపేర్లకు 5.00 లక్షలు, నూతన బోరు బావులు వేసి మోటర్లు ఫిట్టింగ్ ఏర్పాటు చేయుటకు 10.00 లక్షలు, సానిటేషన్ నిర్వహణకు 15.00లక్షలు, శ్మశానవాటికలలో మౌలిఖ వసతులకు 10.00లక్షలు, మరియు డ్రైనేజీ నిర్మాణములకు 15.00 లక్షలతో పనులు చేపట్టుటకు కౌన్సిల్ ఆమోదించారు. ఈ సమావేశములో వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి కౌన్సిలర్లు కొంగరి కృష్ణ పెద్దల చక్రపాణి కర్నాటి రవీంధర్ గుండు మధు సామల మల్లారెడ్డి భోగ భానుమతి విష్ణు మోటె రజిత రాజు కూడికల అఖిలా బలరాం దేవరాయ కుమార్ కో ఆప్షన్ సభ్యులు జల్ది నర్సింహా సయ్యద్ అజ్హర్ నూస్రత్ సుల్తానా షరీఫ్ మేనేజర్ నిర్మలా సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే

**కోదాడ టౌన్, జనవరి 20 (ప్రజా జ్యోతి ):**




మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే వెళ్లాల్సి వస్తుంది అని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ షేక్ జిలాని అన్నారు. సోమవారం కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని యూనిట్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ రహదారి భద్రత మహోత్సవంలో భాగంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ షేక్ జిలాని కార్యాలయం కు వచ్చిన వాహన చోదకులకు అవగాహన కల్పించి మాట్లాడారు. రహదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనం నడుపు రాదని, సీట్ బెల్ట్ కంపల్సరిగా పెట్టుకోవాలని, వాహనాలను అధిక స్పీడ్ తో ఓవర్ లోడ్ తో నడపరాదని, అక్కడికి వచ్చిన వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఆఫీస్ సిబ్బంది , వాహనదారులు పాల్గొన్నారు.

# మాంటిసోరి స్కూల్లో ఘనంగా ఇంటర్ స్కూల్ అన్యువల్ స్పోర్ట్స్ మీట్

**రాజాపేట, జనవరి 20 (ప్రజా జ్యోతి )**



రాజపేట మండల కేంద్రంలోని మాంటిసోరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సోమవారం ఇంటర్ స్కూల్ అన్యువల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజపేట మండల విద్యాధికారి చందా రమేష్ పాల్గొని మాట్లాడారు. అరుంధతి విద్యాలయాల వ్యవస్థాపకులు దశరథ గౌడ్ కౌసల్య, కీసర అరుంధతి విద్యాలయం ప్రిన్సిపాల్ ప్రసన్న, రాజపేట విశ్వభారత్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుహాన్న, రాజపేట మాంటిస్సోరి స్కూల్ ప్రిన్సిపల్ లలితాదేవి లు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈఓ చందా రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు ఎంతో ముఖ్యమని దీంతో ఆరోగ్యం, మేధాశక్తి పెరుగుతుందన్నారు. పాటల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. అరుంధతి విద్యాలయాల వ్యవస్థాపకులు దశరథ గౌడ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని వారి చేతుల్లోనే దేశ భవిష్యత్తు దాగి ఉందన్నారు. పాటలతో వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలు అలవరుతాయన్నారు. అందుకోసమే ప్రతి సంవత్సరం పాఠశాలల లో అన్యువల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలి

## నేటి నుండి 24వ తేదీ వరకు వార్డు సభలు

## మున్సిపల్ కమిషనర్ రమాదేవి




**కోదాడ టౌన్, జనవరి 20 (ప్రజా జ్యోతి):**

కోదాడ మున్సిపాలిటీలోని వార్డుల వారీగా ఈనెల 21 అనగా నేటి నుండి 24వ తేదీ వరకు వార్డుసభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్డు సభల యందు ఇందిరమ్మ లబ్ధిదారుల , రేషన్ కార్డుల లబ్ధిదారుల పేర్లు చదివి వినిపిస్తారని తెలిపారు. ఎవ్వరికైన ఇంకను ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు రాని వారు వార్డు సభల యందు తెల్ల కాగితముపై వ్రాసి ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు ఇవ్వబడునని సూచించారు. వార్డు సభల యందు ఎవ్వరైన అర్హులు ధరఖాస్తు చేసుకొలేని యెడల తదుపరి మున్సిపాలిటీ కార్యాలయము నందు ఏర్పాటు చేసిన ప్రజా పాలనా కేంద్రము యందు ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.,ఈ ప్రక్రియ నిరంతరము జరుగునని, ప్రజలు అందరూ ఎలాంటి అపోహలకు గురికాకుండా ధరఖాస్తు చేసుకొనగలరని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**చిట్యాల జనవరి 20 ప్రజా జ్యోతి**

చిట్యాల మండలం వెలిమినేడు శివారులో జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదం జరిగింది. బైక్ను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్పై వెళుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుడిని కృష్ణ జిల్లాకు చెందిన విక్రమ్ గా గుర్తించారు. మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# సాగునీటి జలాల కోసం రాజపేటలో రైతు ల అర్ధనగ్న ప్రదర్శన



**రాజ పేట జనవరి 20 (ప్రజా జ్యోతి )**

రాజపేట మండలానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాజపేట మండల రైతు జేఏసీ ఆధ్వర్యంలో మరో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మూడో రోజు నిరసనగా అర్ధనగ్నంతో ఈ ప్రాంతానికి నీళ్లు రావాలని నిరసన నిర్వహించినట్లు రైతు జేఏసీ రాజపేట మండల కన్వీనర్ ఎర్ర గోకల జశ్వంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి మండల కన్వీనర్ ఎర్ర గోకుల జస్వంత్, చిగుళ్ల బీరయ్య, చలమల్లపల్లి లక్ష్మణ్, నాగపురి పుల్లయ్య, పంది రాజు,, మాజీ డైరెక్టర్ గుంటి కృష్ణ, మాజీ జెడ్పిటిసి రామకూర గోపాల్, రాష్ట్ర సర్పంచుల ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, నరసాపురం మాజీ సర్పంచి గోపిరెడ్డి, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, రైతులు వివిధ గ్రామాల జేఏసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఉపాధ్యాయురాలికి సన్మానం

**సంస్థాన్ నారాయణపురం, జనవరి 20, (ప్రజాజ్యోతి ):**

కొర్ర తండా చెందిన గిరిజన ఉపాధ్యాయురాలు కొర్ర చందన గురుకుల పాఠశాల పిజిటి ఉద్యోగానికి ఎంపికైన సందర్భంగా గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో కొర్ర చందనను పలువురు ఉద్యోగులు అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ప్రేమ్ సింగ్, హార్టికల్చర్ డైరెక్టర్ సురేష్ నాయక్, అసోసియేషన్ సభ్యులు వాంకుడోత్ బన్సీలాల్, ఆంగోతి శంకర్ నాయక్, లచ్చిరాం నాయక్, కుర్ర జగ్రామ్, బద్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# గ్రామసభల్లో ప్రత్యేక కౌంటర్ లో దరఖాస్తు చేసుకోవాలి : శ్యాంసుందర్

**రాజాపేట, జనవరి 20 (ప్రజా జ్యోతి )**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు పథకాల లబ్ధి కోసం దరఖాస్తు చేసుకోని వారు ఈనెల 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరిగే గ్రామసభలలో ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని రాజపేట మండల ప్రత్యేక అధికారి ఎన్నికల శ్యామ్ సుందర్ కోరారు. సోమవారం రాజాపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన గ్రామసభల టీంలీడర్లతో కలిసి వివరాలు చెప్పారు. ఈనెల 16వ, తేదీ నుండి మండలంలోని అన్ని గ్రామాలలో అధికారులు లబ్ధిదారులను పారదర్శకంగా చేపట్టడం జరిగిందని అట్టి పరిశీలన చేసిన జాబితాను ఈ నెల 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో పరిశీలన చేసిన జాబితాతో గ్రామసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా పాలన ద్వారా వచ్చిన దరఖాస్తులు గతంలో పెండింగ్ లో ఉన్న ప్రతి దరఖాస్తును పరిశీలించడం జరిగిందని ఆయన చెప్పారు. నాలుగు పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల ఈ పథకాలకు దరఖాస్తులు చేసుకొనట్లయితే గ్రామసభలలో ప్రత్యేక కౌంటర్ లో దరఖాస్తు చేసుకోవాలని ప్రజలను కోరారు. ఇండ్లు రేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం ఉంటుందన్నారు. గ్రామసభల్లో ప్రతి అర్జీకి రసీదు తీసుకోవాలని, భద్రపరచుకోవాలని చెప్పారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఫోన్ నెంబర్ ఇవ్వాలన్నారు. సేద్యానికి అనుకూలంగా 47188 ఎకరాల భూమి ప్రాథమిక సర్వే ప్రకారం గుర్తించబడిందని, ఆత్మీయ భరోసా అర్హులు ప్రాథమిక సర్వే జాబితా ప్రకారం 886 మంది మండలంలో ఉన్నారని, కుల గణన ప్రకారం 908 మంది ప్రజాపాలన ద్వారా 2854, మీసేవ ద్వారా 2170 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. 9445 ఇండ్ల కోసం దరఖాస్తు రాగా నాన్ పక్క జాబితా 2912 మంది ఉన్నారని అన్నారు. ఈరోజు 21వ తేదీన మంగళవారం కాల్వపల్లి తహసిల్దార్ దామోదర్ టీం లీడర్ గా, లక్ష్మక్క పల్లి గ్రామ పంచాయతీ వద్ద ఎంపీ ఓ ఆవుల కిషన్ టీం లీడర్ గా, బూరుగుపల్లి గ్రామసభ ఎంపీడీవో నాగవేణి టీం లీడర్ గా, రేణిగుంట గ్రామసభ ఏవో పద్మజ టీం లీడర్ గా, దూది వెంకటాపురం గ్రామ సభ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శాంతి నిర్మల టీం లీడర్గా, కొత్త జాల లో గ్రామసభ మండల విద్యాధికారి చందా రమేష్ టీం లీడర్ గా 22వ, తేదీ బుధవారం బసంతాపురం గ్రామ పంచాయతీ వద్ద వ్యవసాయ అధికారిని జి. పద్మజ టీం లీడర్ గా, నమిల గ్రామపంచాయతీ వద్ద ఎంపీడీవో కే. నాగవేణి టీం లీడర్ గా, సోమారం గ్రామపంచాయతీ వద్ద ఎంపీవో ఆవుల కిషన్ టీం లీడర్ గా, జాల గ్రామపంచాయతీ వద్ద ఎంఈఓ చందా రమేష్ టీం లీడర్ గా, నర్సాపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎం దామోదర్ టీం లీడర్ గా, సింగారం గ్రామపంచాయతీ వద్ద అసిస్టెంట్ అగ్రికల్చర్ డైరెక్టర్ శాంతి నిర్మల టీం లీడర్ గా, 23వ తేదీ గురువారం రఘునాథపురం గ్రామపంచాయతీ వద్ద ఎంపీడీవో కే నాగవేణి టీం లీడర్ గా, బొందుగుల గ్రామపంచాయతీ వద్ద వ్యవసాయ అధికారిని పద్మజ టీం లీడర్ గా, పాము కుంట గ్రామపంచాయతీ వద్ద మండల విద్యాధికారి చందా రమేష్ టీం లీడర్ గా కొండేర్ చెర్వు గ్రామపంచాయతీ వద్ద తహసిల్దార్ దామోదర్ టీం లీడర్ గా, పుట్టగూడెం గ్రామపంచాయతీ వద్ద అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ శాంతి నిర్మల టీం లీడర్ గా మల్లా గూడెం గ్రామపంచాయతీ వద్ద ఎంపీ ఓ ఆవుల కిషన్ టీం లీడర్ గా, 24వ తేదీ బేగంపేట గ్రామపంచాయతీ వద్ద ఏవో పద్మజ టీం లీడర్ గా, చల్లూరు గ్రామ పంచాయతీ వద్ద ఎంపీ ఓ ఆవుల కిషన్ టీం లీడర్ గా పారుపల్లి గ్రామపంచాయతీ వద్ద ఎంపీడీవో నాగవేణి టీం లీడర్ గా కురారం గ్రామపంచాయతీ వద్ద ఎంఈఓ చందా రమేష్ టీం లీడర్ గా రాజపేట గ్రామపంచాయతీ వద్ద తహసిల్దార్ దామోదర్ టీం లీడర్ గా గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్, ఎంపీడీవో నాగవేణి, ఎంఈఓ చందా రమేష్, ఎంపీ ఓ ఆవుల కిషన్, ఏవో పద్మజ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శాంతి నిర్మల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయుడి పై జరిగిన దాడిని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన

**నాంపల్లి, జనవరి, 20 (ప్రజా జ్యోతి ):**

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి పై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం నాంపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ మండలకమిటీ అధ్యక్షులు జింకల సత్యనారాయణ మాట్లాడుతూ తుక్కుగూడ పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థులను ఎక్కాలు అడిగి దండించాడనే నేపంతో అతనిపై భౌతిక దాడులకు పాల్పడడం హేయమైన చర్యగా అభివర్ణించారు. సమాజంలో ఉపాధ్యాయుల పట్ల ఎంత చులకన భావం నెలకొని ఉన్నదో ఈ సంఘటన తెలియజేస్తున్నదన్నారు.విద్యావ్యవస్థ అభివృద్ధికి ఇటువంటి సంఘటనలు గొడ్డలి పెట్టులా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కస్పరాజు వెంకన్న, పల్లెటి వెంకటయ్య, రాస మల్ల శ్రవణ్ కుమార్ యాదయ్య, సంపత్, దీవంత,నక్క యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.




# రాజపేట మండలంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆకస్మిక తనిఖీ

**రాజ పేట జనవరి 20 (ప్రజా జ్యోతి )**

రాజపేట మండలంలో సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కె. సత్యనారాయణ చల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను, దూది వెంకటాపురం ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరీక్షించి, సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ తీసుకున్నారు. కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, వారికి నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. ప్రతి రోజు చివరి పిరియడ్ లో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను, తెలివైన విద్యార్థులకు ఎన్.ఎం.ఎం.ఎస్. స్కాలర్షిప్ సాధనకు తరగతులను నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులను అభినందించారు. చల్లూరు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీని అభినందించారు. చల్లూరు ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలించి స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రధానోపాధ్యాయురాలు వసంత ద్వారా వివరాల అడిగి తెలుసుకుని అభినందించారు. దూది వెంకటపురం ఉన్నత పాఠశాలలో వివరాలను ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ద్వారా వివరాలు అడిగి తెలుసుకుని సంతోషం వ్యక్తం చేస్తూ, విద్యార్థులు ప్రతిరోజు వేకువ జామున లేచి చదువుకోవాలని కోరారు.



# ఆర్థిక సాయం అందజేత

**చౌటుప్పల్ జనవరి 20 (ప్రజా జ్యోతి )**

పీపల్ పహాడ్ గ్రామానికి చెందిన పెరికేటి వరుణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.ఈ విష యం తెలుసుకున్న స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు సోమవారం వరుణ్ కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఆర్థిక సాహయం అందజేశారు. వరుణ్ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కొండ యాదయ్య, దోసపాటి అశోక్, మెట్టు మహేశ్వర్ రెడ్డి బత్తుల మల్లేష్ గౌడ్, సిల్వర్ నరేష్, తాళ రమేష్ అశోక్ రెడ్డి, సిరిగుళ్ల నవీన్, రోషణ గారి ఎలేషా, రోషన్ గారి యాదయ్య, ఎర్ర శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



# అలరించిన సినీ స్వరాభిషేకం





**మిర్యాలగూడ,జనవరి 20, (ప్రజాజ్యోతి ):**

సినీనటులు ఎన్టీఆర్,ఏఎన్ఆర్,శోభన్ బాబులను స్మరించుకుంటూ దాదాపుగా 10గంటలు పాటలు పాడటం చాలాగొప్ప విషయమని ఆలయకమిటీ అధ్యక్ష కార్యదర్శులు వెంకటరెడ్డి, రంగయ్య అన్నారు. రాజేందర్, అడ్వకేట్ రఘురామరావు లు అన్నారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ వెంకటేశ్వరస్వామి కళామండపం లో మిర్యాలగూడకళావేదిక వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్ర, తెలంగాణ లోని వివిధ జిల్లాల నుండి వచ్చిన గాయనీ గాయకులు చాలా అద్భుతంగా పాటలు పాడారన్నారు.టీవీలలో వస్తున్న స్వరాభిషేకానికి ఏమాత్రం తీసిపోదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేయాలని ఆశించారు.కార్యక్రమ అనంతరం మిర్యాలగూడకళావేదికవారుగాయనీ గాయకులను శాలువా, మెమంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మిర్యాలగూడలో ఇప్పటివరకు 7 స్వరాభిషేకాలు నిర్వహించామని వెన్నంటి ప్రోత్సహిస్తున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏలె సత్యనారాయణ, ఎం సత్యనారాయణచారి, శ్రీనివాసచారి,మురళీధర్‌కందుకూరిసుదర్శన్, గాయని గాయకులు తడకమళ్ల ఎర్రాంరంగారావు ప్రతాప్ సత్యనారాయణ, ఎల్లయ్య, నాగరాజు, గాని శ్రీనివాస్ దుర్గా సౌజన్య పద్మశ్రీ, సుజాత శోభారాణి చందన, మౌనిక, సరస్వతి, నాగమణి, మైథిలి, విజయ ట్రాక్ సత్యపైల, అండాలు, రవి, హాఫీజుద్దీన్,రమణ, అహరోన్, మోహన్‌రావు, రమేష్ శర్మ, రచయిత చింతామధు రాజరత్నం పాల్గొన్నారు.

## రోడ్డు మధ్యలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ మరోచోటికి తరలించాలి



**మిర్యాలగూడ,జనవరి 20, (ప్రజాజ్యోతి ):**

రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ వల్ల ఇబ్బందులు ఎదురు అవుతున్నాయంటూ, మరో చోటికి తరలించాలంటూ సోమవారం పట్టణంలోని రాంనగర్ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్ఫార్మర్ను మరోచోట సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఒన్ టౌన్ సిపిఎం కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, నాగిరెడ్డి, మంగారెడ్డి, మోతే వజీర్ బంటు రామారావు, అంజమ్మ దుర్గమ్మ, బేబీ, చంద్రకళ, పాండు, అంజయ్య ఉన్నారు.

## ఇంటింటి పశుగణన సర్వేకు సహకరించాలి..

**–డాక్టర్ నాయిని దుర్గా రమాదేవి**



**మిర్యాలగూడ, జనవరి 20, (ప్రజాజ్యోతి ):**

212వ అఖిల భారత పశుగణన మిర్యాలగూడ మండలంలో ప్రారంభమైనదని మిర్యాలగూడ మండలం ఆలగడప పశువైద్యాధికారి డాక్టర్ నాయిని దుర్గారమాదేవి సోమవారం తెలిపారు.రైతు సోదరలందరూ ఇంటికి వచ్చే విషయ సేకరణదారులకు పశువుల యొక్క సమగ్ర సమాచారాన్ని అందించగలరని కోరారు.ప్రతి ఇంటి వద్దనున్న గేదెలు, ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కోళ్ళు, కుక్కలు, పందులు మొదలగువాటి సమాచారం కోసం సిబ్బందీ ఇంటింటి సర్వే కు వచ్చినపుడు అందించాలని కోరారు. పశుగణన ద్వారా పశువుల పథకాల రూపకల్పనకు, వనరుల కేటాయింపుకు, ఖచ్చితమైన డేటా మెరుగైన వ్యాధి నిర్మూలణకు తోడ్పడుతుందన్నారు. ప్రస్తుతం మిర్యాలగూడ మండలంలో ఆలగడప, తడకమళ్ల, యాద్గర్ పల్లి, ఊట్లపల్లి, ఈదులగూడెం, తుంగపహాడ్, నందిపహాడ్ నందు పశుగణన జరుగుతూందని రైతులు సహకరించాలని కోరారు.

## మెడికల్ షాప్ ని ప్రారంభించిన అడ్డగూడూర్ ఎస్ ఐ నాగరాజు



**అడ్డగూడూర్, జనవరి 20 (ప్రజాజ్యోతి )**

అడ్డగూడూరు మండల పరిధిలోని చౌళ్లరామారం గ్రామం మెయిన్ రోడ్ వలిగొండ, తొర్రూర్ జాతీయ రహదారిపై ఆనుకుని ఉన్న ప్రయాణికుల ప్రాంగణం సమీపంలో శ్రీ లక్ష్మీనరసింహ మెడికల్ & జనరల్ స్టోర్ షాప్ ఏర్పాటు చేయడం జరిగింది ఇట్టి మెడికల్ షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా అడ్డగూడూరు ఎస్సై నాగరాజు హాజరై మెడికల్ షాపును ప్రారంభించారు.అడ్డగూడూరు మండలం పరిధిలోని వివిధ గ్రామాలకి సంబంధించిన ఆర్ఎంపీ బృందం పాల్గొన్నారు. మండల పరిసర ప్రాంత ప్రజలకి మెడిసిన్స్‌ను అందుబాటులో ఉంచినట్లు ప్రొప్రైటర్ ధనుంజయ తెలిపారు. మరియు షాపు ప్రారంభోత్సవానికి కు వచ్చిన మండల నాయకులకి ప్రజలకి ధన్యవాదాలు తెలియజేశారు.

## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న స్నేహితులు



**వలిగొండ (జనవరి 20) ప్రజాజ్యోతి**

మండలపరిధిలోని దాసిరెడ్డిగూడెం గ్రామంలోని దంతూరి యాదయ్య గారి తండ్రి దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆయన ఫోటోకు పూలమాల వేసి నివాళులర్పించిన స్నేహితులు ఈ కార్యక్రమంలో బత్తిని బాలిశెట్టి,వనం భిక్షపతి, లవణం ఉపేందర్, గిరి ప్రభాకర్,కోయడం ప్రతాప్, కెమ రవి,అంతటి గోపాల్,పోట్లపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

## శిలాఫలకం ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**ఎస్ఐ నాగరాజు**



**అడ్డగూడూరు జనవరి 20 (ప్రజాజ్యోతి )**

అడ్డగూడూరు మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో అంగన్వాడి బడికి నూతన భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం ను ధర్మారం గ్రామానికి చెందిన మందుల శ్రీకాంత్ తండ్రి వెంకన్న అను వ్యక్తి తన మోటార్ సైకిల్ తో తేదీ. 19.01.2025 కూల్చిన విషయంలో భాగంగా అట్టి వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ ఐ నాగరాజు తెలిపారు.

## వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలి

**నేటి నుండి 24వ తేదీ వరకు వార్డు సభలు**

**మున్సిపల్ కమిషనర్ యం. రామదుర్గా రెడ్డి**



**హాలియా,జనవరి 20 (ప్రజాజ్యోతి ):**

హాలియా మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల వారీగా నేటి నుండి 24వ తేదీ వరకు వార్డుసభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ యం. రామదుర్గా రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.వార్డు సభల యందు ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డుల లబ్ధిదారుల పేర్లు చదివి వినిపిస్తారని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు రాని వారు వార్డు సభలలో తెల్ల కాగితముపై రాసి ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు అందుతాయని పేర్కొన్నారు. వార్డు సభల యందు ఎవరైనా అర్హులై ఉండి ధరఖాస్తు చేసుకొలేని యెడల తదుపరి మున్సిపాలిటీ కార్యాలయము నందు ఏర్పాటు చేసిన ప్రజా పాలనా కేంద్రము యందు ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ఈ ప్రక్రియ నిరంతరము కొనసాగుతుందని ప్రజలు అందరూ ఎలాంటి అపోహలకు గురికాకుండా ధరఖాస్తు చేసుకొనగలరని కోరారు.


## రేపు వాడపల్లి లో లక్ష్మీ నరసింహ స్వామి వార్ల కళ్యాణం మహోత్సవం

**–చైర్మన్ పొదిల శ్రీనివాస్**



**దామరచర్ల, జనవరి 20, (ప్రజాజ్యోతి ):**

దామరచర్ల మండలం లోని ప్రసిద్ధిగాంచిన సంఘమ క్షేత్రమైన వాడపల్లిలో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 22వ తారీఖున స్వామివార్ల కళ్యాణ మహోత్సవం జరగనున్నట్లు ఆలయ చైర్మన్ పొదిల శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఆగమ శాస్త్ర నియమాలతో వైభవంగా జరిగే ఈ కళ్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించి స్వామి వారి తీర్థప్రసాదాల స్వీకరించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.



# నేటి నుంచి 24 వరకు గ్రామసభలు

### –గ్రామ సభలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలి

### –ఎంపీడీఓ సందీప్ కుమార్



*చౌటుప్పల్ జనవరి 20 ( ప్రజా జ్యోతి )*

నేటి నుంచి జనవరి 24 వరకు గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సందీప్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారుల ఎంపిక చేయడానికి జనవరి 21 న ఎల్లంబావి, కాట్రేవ్, కైతపురం,కుంట్లగూడెం,చింతలగూడెం ఎనగంటి తండ,22 న పెద్ద కొండూరు,గుండ్ల బావి,అల్లాపురం, తూప్రాన్ పేట్, నేలపట్ల,దామేర,ధర్మోజి గూడెం, మసీదు గూడెం,23 న అంకిరెడ్డిగూడెం, ఎస్. లింగోటం, పీపల్ పహడ్,మందోళ్ల గూడెం, ఎల్లగిరి, చిన్న కొండూరు, ఆరెగూడెం,24 న కొయ్యలగూడెం, పంతంగి, జై కేసారం, దేవలమ్మ నాగారం, దండు మల్కాపురం గ్రామాలలో సభలను చేపడుతున్నట్లు తెలిపారు.నూతన దరఖాస్తుదారులు గ్రామసభ లో ప్రత్యేకంగా ఏర్పరిచిన కౌంటర్లలో వారి దరఖాస్తులు ఇచ్చి రసీదు పొందాలని కోరారు.

# ఉపాధ్యాయులకు పిఆర్టియు ఐడి కార్డులు అందజేత



*సంస్థాన్నారాయణపురం, జనవరి 20, (ప్రజాజ్యోతి ):*

పి ఆర్ టి యు ఉపాధ్యాయ యూనియన్ ఐడి కార్డులను సోమవారం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. పి ఆర్ టి యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్ రెడ్డి చేతులమీదుగా ఈ ఐడి కార్డులను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి ,యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కుంట్ల అమరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గడసంతుల మధుసూదన్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ ,ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరసింహారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు జాలిగామ రామ్మోహన్, మండల విద్యాధికారి గోలి శ్రీనివాసులు, పి ఆర్ టి యు మండల అధ్యక్షుడు నంద్యాల చలపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి దోర్నాల రాము, గెజిటెడ్ ఉపాధ్యాయులు ఉదయ, వేణుగోపాల్, సురేందర్ రెడ్డి, ఉష తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలి

### ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్



*మఠంపల్లి జనవరి 20 ప్రజా జ్యోతి*

నేటి నుంచి జనవరి 24 వరకు గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మఠంపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారుల ఎంపిక చేయడానికి ఈనెల 21 న అల్లిపురం,అవిరేణి కుంట తండా,దొనబండ తండ,తుమ్మల తండ,భీమ్లా తండా, కాల్వపల్లి తండా,లాలి తండా,పాత దొనబండ తండా,22 న బడవా తండా, చౌటపల్లి,గుర్రంపోడు తండా,మంచ్య తండా,జమ్లు తండా,కామాక్షికుంట తండా,కృష్ణ తండా,23న బక్క మంతుల గూడెం,గుండ్లపల్లి,యాతవ కిల్ల,రఘునాధపాలెం,బిల్యా నాయక్ తండ,హనుమంతుల గూడెం,రామచంద్రపురం,24 న కింది తండ,మఠంపల్లి, పెదవీడు,వర్దాపురం, చెన్నాయి పాలెం,సుల్తాన్ పురం తండా,మట్టపల్లి గ్రామాలలో సభలను చేపడుతున్నట్లు తెలిపారు.నూతన దరఖాస్తుదారులు గ్రామసభ లో ప్రత్యేకంగా ఏర్పరిచిన కౌంటర్లలో వారి దరఖాస్తులు ఇచ్చి రసీదు పొందాలని కోరారు.

# బిఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తాం

### –నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

### –కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై ఎన్ని కేసులు పెట్టినా భయపడం



*నిడమనూరు, జనవరి 20(ప్రజాజ్యోతి ):*

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కొసం పోరాటం చేస్తామని నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు.సోమవారం త్రిపురారం మండల కేంద్రంలోని త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భగత్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులపై దర్నా చేయాలని కేటీఆర్ పిలుపు నివ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెట్టి వేదిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హమినీ విస్మరించి సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలు మోసం చేశారని విమర్శించారు. ఏదైనా ఎన్నికలు వచ్చే ముందే ప్రజా సంక్షేమ పథకాల పేరిట దరఖాస్తులు గుర్తుకు వస్తాయని, గ్రామాల్లోని వచ్చే అధికారులను ప్రజలు నిలదీయాలన్నారు. మండల బీఆర్ఎస్ నాయకులు నిర్లక్ష్యంగా ఉండకుండా గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మమేకం కావాలని, ప్రజల సమస్యలు తెలుసుకొని వెన్నుదన్నుగా ఉండాలన్నారు. ప్రజలే కాంగ్రెస్ కు బుద్ధి చెబుతారన్నారు. ఈకార్యక్రమం లో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, కామర్ల జానయ్య, పావనగుండ్ల వెంకటాచారి, అనుముల శ్రీనివాస్ రెడ్డి, గుండెబోయిన వెంకటేశ్వర్లు, భైరం కృష్ణ, జంగిలి శ్రీనివాస్, చింతకాయల యాదయ్య, షేక్ దస్తగిరి, సయ్యద్,రాయనబోయిన వెంకన్న, నగిరి, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు ఇండ్లు ఇవ్వాలి

### ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన సిపిఐ నాయకులు

*సంస్థాన్నారాయణపురం, జనవరి 20, (ప్రజాజ్యోతి ):*

అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చౌటుప్పల్ ఆర్డిఓ శేఖర్ రెడ్డి సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా సిపిఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రజా పాలనలో వేలాదిమంది ప్రజలు రేషన్ కార్డుల కోసం ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేశారన్నారు. ఇటీవల అధికారులు గ్రామాలలో సర్వే పేరుతో తిరుగుతూ కొంతమంది పేర్లు మాత్రమే వచ్చినట్లు పేర్కొనడంతో ప్రజలంతా ఆందోళన చెందుతున్నారన్నారు. తమకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు వస్తుందో రాదోనని ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు అందించాలని ఇందిరమ్మ ఇండ్లు



అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య యాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కలకొండ సంజీవ, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, మండల సహాయ కార్యదర్శిలు చిలువేరు అంజయ్య, పొట్ట శంకరయ్య, రైతు సంఘం నాయకుడు పల్లె మల్లారెడ్డి, వీరమల్ల యాదయ్య, చిలువేరు పెంటయ్య, వెంకన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి : ఎన్ వి సుబ్బారావు

*పాలకవీడు, జనవరి 20(ప్రజా జ్యోతి ):*

పాలకవీడు మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్ వి సుబ్బారావు అధికారులను కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మాజీ ఎంపీపీ భూక్య గోపాల్ నాయక్ మాజీ జెడ్పిటిసి బుజ్జి మోతిలాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి నరసింహారావు. వివిధ గ్రామ శాఖల నాయకులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా.రేషన్ కార్డుల అర్హుల ఎంపికపై ఎంపీడీవో లక్ష్మితో చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ. తప్పుడు ప్రచారం నమ్మవద్దని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు పేదలందరకి అందే విధంగా రాష్ట్ర భారీ నీటిపారుదల ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. కొత్త రేషన్ కార్డుల విషయంలో ఎలాంటి అపోహలు వద్దని ప్రస్తుతం జరుగుతున్న సర్వే తో పాటు రేపు జరగబోయే గ్రామ సభల్లో అర్హులను కూడా గుర్తించి వారి నుండి దరఖాస్తులు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో భాగంగా భూమి



లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 12000 అందించే విధంగా ఉపాధి హామీ పని దినాల ఆధారంగా ఎంపిక చేస్తున్న ప్రక్రియను పూర్తిస్థాయిలో పరిశీలించి ఇంకా అర్హులైన పేదలందర్నీ గుర్తించే విధంగా అధికారులు పారదర్శకంగా పని చేయాలని కోరారు. గ్రామస్థాయిలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని గ్రామ సభల్లో చర్చించి అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పాలకవీడు మాజీ ఎంపీటీసీ మీసాల ఉపేందర్ నీమానాయక్ శ్రీకాంత్ శేషు భూషిపలి వెంకట్ రెడ్డి. మునగాల భాస్కర్ రెడ్డి.ముండ్ల నాగేష్. యతం శ్రీను.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పతకాలు అందేలా చూడాలి : పెరుమాల్ల సతీష్

*పాలకవీడు, జనవరి 20 (ప్రజా జ్యోతి ):*

అర్హులైన నిరుపేదలకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని అని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పేరుమల సతీష్ అన్నారు. సోమవారం రోజు పాలకీడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కి వినతి పత్రం ఇచ్చి అభ్యర్థించారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని ఎటువంటి రాజకీయ నాయకుల ప్రలోభాలకు లొగ్గకుండా పార్టీలకు అతితంగా ఎంపిక జరగాలి అని, ప్రభుత్వం విడుదల చేసిన కొత్త రేషన్ కార్డుల లిస్టులో భూస్వాముల పేర్లు గవర్నమెంట్ ఎంప్లాయ్ ల పేర్లు ఉన్నాయి. అసలైన నిరుపేదలకు రేషన్ కార్డు లిస్టులో పేరు లేదు అని, ఎంపీడీవో సమగ్ర విచారణ జరిపి అర్హులైన నిరుపేదలకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వచ్చే విధంగా చూడాలి అని ఎంపీడీవో ని కోరారు.ఇట్టి కార్యక్రమంలో జాన్ రెడ్డి, మంద నాగయ్య,శ్రీను, హనుమంతు, వీరబాబు, అంజి, సిద్దు,మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

